# పని చేసే ప్రభుత్వాన్ని ఆదరించాలి



పరకాల : డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

- రాష్ట్ర అభివృద్ధిని ఓర్వలేకే సర్కారుపై విపక్షాల నిందలు
- పేద వర్గాలకు అండగా సీఎం కేసీఆర్
- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- వెల్లంపల్లి, గూడెప్పాడ్ గ్రామాల్లో డబుల్ బెడ్ రూం ఇండ్లు, మొగిలిచెర్లలో 500 మెట్రిక్ టన్నుల గోదాం ప్రారంభం

పరకాల, అక్టోబర్ 8 : రాష్ట్రంలో పేద వర్గాలకు సీఎం కేసీఆర్ అండగా నిలుస్తూ వారి సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నారని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రారంభించి 29 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశా రు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదిన్నర ఏండ్లలోనే అభివృద్ధిలో ముందంజలో నిలుస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక విజన్‌తో పాలన కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్రం లో అన్ని వర్గాలకు సంక్షేమాన్ని అందించేలా పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో అమ లవుతున్న అనేక పథకాలు ఇతర రాష్ట్రాలు, దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తున్నాయన్నారు. సీఎం కేసీఆర్ పేదల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని మేనిఫెస్టోలో లేని ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి, పారదర్శకంగా అమలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేని కాంగ్రెస్, బీజేపీ నాయకులు తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించేలా రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేసే సీఎం కేసీఆర్‌కు అండగా నిలువాలని, ఆయన మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆగ్రోస్ మాజీ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, ఎంపీపీ తక్కలపల్లి స్వర్ణలత, జడ్పీటీసీ మొగిలి, వైస్ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ వెలగందుల కృష్ణ, తహసీల్దార్ జగన్‌మోహన్ రెడ్డి, నాయకులు నేతాని శ్రీనివాస్‌రెడ్డి, నిప్పాని సత్యనారాయణ, బండి సారంగపాణి, గంట సమ్మిరెడ్డి, రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

**గూడెప్పాడ్‌లో..**

ఆత్మకూరు : మండలంలోని గూడెప్పాడ్‌లో 22 డబుల్ బెడ్ రూం ఇండ్లను సర్పంచ్ బీరం శ్రీలత రామకృష్ణారెడ్డితో కలిసి పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పా టు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో 52 మంది లబ్ధిదారుల కు డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందించినట్లు తెలిపారు. కొత్తగా మరో 22 మంది పేదల కోసం డబుల్ బెడ్‌రూం ఇండ్లు ప్రారంభించినట్లు చెప్పారు. పేదవారి సొంతంటి కల నెరవేర్చడానికి సీఎం కేసీఆర్ గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. నూతనంగా నిర్మించిన ఇండ్లకు త్వరలోనే నల్లా నీళ్లు అందిస్తామన్నారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం హయాం లో తెలంగాణ ప్రాంతం ఎలా అభివృద్ధి చెందిందో ప్రజలు గమనించాలన్నారు. నియోజకవర్గంలో బీజేపీలో ఊరుకొక్కడు లేడు గానీ బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేసున్నారన్నారు. దాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. డబుల్ బెడ్ ఇండ్లు నిర్మించిన కాంట్రాక్టర్ జనగాం సాంబయ్యను ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సత్కారించారు. పీఆర్ డీఈ లింగారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ బత్తిని సంగీత, పీఆర్ ఏఈ లత, ఎంపీపీ మార్క సుమలతా రజినీకర్, జడ్పీటీసీ కక్కెర్ల రాధికా రాజు, సర్పంచ్‌లు బీరం శ్రీలతా రామకృష్ణారెడ్డి, రంపీస మనోహర్, మాడిశెట్టి వేణుగోపాల్, మచ్చిక యాదగిరి, వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, గూడెప్పాడ్ మార్కెట్ చైర్మన్ బొల్లోబోయిన రాధారవి యాదవ్, మాజీ చైర్మ న్ కాంతాల కేశవరెడ్డి, మాజీ సర్పంచ్ జనగాం స్వరూపా సాంబయ్య, ఉపసర్పంచ్ వీసం శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబటి రాజస్వామి, బీఆర్ఎస్ నాయకులు కాంతాల రవీందర్‌రెడ్డి, రెమిడి బుచ్చిరెడ్డి, రెమిడి కృష్ణారెడ్డి, వంగాల భగవాన్‌రెడ్డి, వీర్ల వెంకటరమణ, తోట కుమారస్వామి పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మొగిలిచెర్లలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గొర్రె పిల్లను బహూకరిస్తున్న యాదవులు

గీసుగొండ : రైతుల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గ్రేటర్ 15వ డివిజన్ రెడ్డిపాలెంలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్స్‌తోపాటు పక్కనే గ్రామస్తులు ఏర్పాటు చేసిన రాణీ రుద్రమదేవి విగ్రహాన్ని ఎమ్మెల్యే అవిష్కరించారు. అనంతరం మొగిలిచెర్ల గ్రామంలో రూ.52 లక్షలతో నిర్మించిన 500 మెట్రిక్ టన్నుల గోదాం, సొసైటీ కార్యాలయాన్ని డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ఎలా ఉండేది? ప్రత్యేక రాష్ట్రంలో ఎలా అభివృద్ధి జరిగిందో ప్రజలు గమనించాలన్నారు. రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటుతో పాటు సాగు నీరు అందిస్తున్నారన్నారు. రైతు మూడు పంటలు పండిస్తున్నడంటే అందుకు సీఎం కేసీఆరే కారణమన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం రైతుల నుంచి పంట కొనుగోలు చేయడం లేదన్నారు. రైతులు పండించిన సరుకులు నిల్వ చేసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం గోదాములను నిర్మిస్తున్నదన్నారు. ప్రజలను మోసం చేయటానికి కొందరు వస్తున్నారన్నారు. మోసాల కాంగ్రెస్‌ను, అబద్దాల బీజేపీని ప్రజలు నమ్మవద్దని కోరారు. నియోజకవర్గం అభివృద్ధి చూసి మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న నాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. యావత్తు దేశం తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమం వైపు చూస్తోందన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న బీఆర్ఎస్‌ను మళ్లీ ఆశ్వీదించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆకులపల్లి మనోహర్, డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, గీసుగొండ సొసైటీ చైర్మన్ రడం శ్రీధర్, సొసైటీ వైస్ చైర్మన్ కందుల శ్రీనివాస్‌రెడ్డి, కోఆపరేటివ్ అధికారులు సంజీవరెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం మహేశ్, బీఆర్ఎస్ నాయకులు సుంకరి శివకుమార్, గజ్జి రాజు, గోలి రాజయ్య, లవ్ రాజు, నర్సయ్య, రఘు, సతీశ్, పూర్ణచందర్, నర్సింగరావు పాల్గొన్నారు.



వనభోజనంలో పాల్గొన్న దుర్గాదేవి కాలనీ వెలమ కుటుంబాలు

## సమష్టిగా వన భోజనాలకు..

న్యూ శాయంపేట, అక్టోబర్ 8 : హంటర్ రోడ్డులోని దుర్గాదేవి కాలనీకి చెందిన పద్మనాయక వెలమ సంఘం ఆధ్వర్యంలో కాలనీవాసులందరూ ఆదివారం సమష్టిగా వన భోజనాలకు(పిక్‌నిక్) తరలివెళ్లారు. ఐనవోలు మండలం ఉడుత గూడెంలోని మామిడి తోటలోని రిసార్టుకు కాలనీవాసులందరూ కలిసి వెళ్లారు. చిన్న, పెద్ద, ఆడ, మగ అనే తేడా లేకుండా ఆనందగా గడిపారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ బిజీగా ఉంటున్నా కూడా దాదాపు వంద కుటుంబాలు కలిసి ఇలా సమష్టిగా వనభోజనాలకు వెళ్లడం గమనార్హం. ఇలాంటి కార్యక్రమాలతో మానవ సంబంధాలు మరింత మెరుగు పడుతాయని చెప్పవచ్చు.

## నేడు గెస్ట్ లెక్చరర్ల నియామకం

నయీంనగర్, అక్టోబర్ 8: వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళ(డిగ్రీ, పీజీ) కళాశాల(అటానమస్)లో 2023–24విద్యా సంవత్సరానికి వివిధ సబ్జెక్టులలో అతిథి అధ్యాపకుల నియామకం కోసం సోమవారం ఉదయం 10.30గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్, లెఫ్టినెంట్ ప్రొఫెసర్ చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్‌లో 2, తెలుగులో 2, హిస్టరీలో 2, కామర్స్‌లో 2, వృక్షశాస్త్రంలో 2, జంతుశాస్త్రంలో 2, మైక్రోబయాలజీలో 2, కంప్యూటర్స్(బీసీఏ)లో ఒక పోస్టు ఖాళీగా ఉందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో దరఖాస్తు అందజేయాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55శాతం మార్కులు, ఎస్సీ ఎస్టీలు 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, నెట్, స్టేట్ పీహెచ్‌డీ అర్హత ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని వివరించారు.



నృత్యం చేస్తున్న కళాకారులు



మాట్లాడుతున్న యాంకర్లు



అభివాదం చేస్తున్న బాలకృష్ణ

## నగరంలో 'భగవంత్ కేసరి' సందడి



కార్యక్రమంలో హీరోయిన్లు కాజల్, శ్రీలీల

హనుమకొండ, అక్టోబర్ 8 : హనుమకొండ నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం రాత్రి నిర్వహించిన భగవంత్ కేసరి ట్రైలర్ లాంచ్ ఫంక్షన్ నేత్ర పర్వంగా జరిగింది. శ్రేయాస్ మీడియా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించగా, జన సందోహంతో మైదానం దద్దరిల్లింది. సినిమా సెట్టింగ్‌లను తలపించేలా ఏర్పాట్లు చేశారు. సినీ హీరో నందమూరి బాలయ్య బాబు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. హీరోయిన్ కాజల్ అగర్వాల్, శ్రీలీల స్టెప్‌లతో అలరించారు. ఈ సందర్భంగా బతకమ్మ ఆట ఆడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. పెద్ద ఎత్తున అభిమానులు తరలి రావడంతో ఆర్ట్స్ కళాశాల మైదానం ఈలలు, కేరింతలతో మార్మోగింది. రచ్చరవి కుటుంబ సభ్యులు సినీ హీరో బాలకృష్ణకు అందించిన తలకాయ కూర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున్న వరంగల్ నగరంతో పాటు చుట్టు పక్కల నుంచి తరలివచ్చిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. పుణ్యస్థలం ఓరుగల్లులో భగవంత్ కేసరీ ట్రైలర్ రిలీజ్ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎందరో మేధావులు, మహనీయులు పుట్టిన గడ్డ ఓరుగల్లు అన్నారు. వరంగల్‌తో తనకు చాలా అనుబంధం ఉందన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తీసిన ఈ సినిమా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా సినీ కళాకారులు చేసిన డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్లు అనిల్ రావిపూడి, బాబి, వంశీ పైడిపల్లి, గోపీచంద్, రచ్చ రవి, వరంగల్ వాస్తవ్యుడు రచయిత కాసర్ల శ్యాం, సినీ యూనిట్ బృంద సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని తిలకిస్తున్న చిత్ర యూనిట్